క్లుప్తంగా

ట్రై సైకిళ్ల అందజేత



నెల్లూరు సిటీ: ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాగుంట లేఅవుట్లోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. దివ్యాంగులకు వీటిని అందజేయడమే వీపీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని వెల్లడించారు. టీడీపీ నేతలు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బిజివేముల ఓబుల్‌రెడ్డి, కిశోర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



పొదలకూరులో కురుస్తున్న వర్షం

పొదలకూరు : మండల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం అకాల వర్షం బీభత్సం సృష్టించింది. నిమ్మ, మామిడి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గాలి వీస్తుండడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం వల్ల ప్రజలు భీతిల్లారు. హోరున గాలి రావడంతో వీధుల్లో చిన్నచిన్న చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అయితే వేసవి తాపం, ఉక్కపోతతో బాధపడుతున్న జనాలకు ఊరట లభించింది.

జేవీవీ పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

పొదలకూరు : పది ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా మందిరంలో పురస్కారాలను ఆదివారం అందజేశారు. 500 మార్కులకుపైన సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మెమెంటో, ఫైల్స్, మెడల్స్‌ను అందించారు. ముఖ్యఅతిథులుగా సర్వశిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, నెల్లూరు అర్బన్ ఎంఈఓ అబ్దుల్‌హమీద్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి హాజరయ్యారు. మ్యాపిల్ రిడ్జ్ ప్రీ స్కూల్ కరెస్పాండెంట్ మురళీరెడ్డి, వెంకట సంతోష్‌కుమార్ దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి కోవూరు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ కల్యాణ్, గౌరవాధ్యక్షుడు దామోదరం, పెంచలస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు



పొదలకూరు : పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లో వివాదాస్పదంగా ఉన్న 286 అంకణాల స్థలంలో పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును ఆదివారం ఏర్పాటు చేశారు. సచివాలయం బిట్–3 సెక్రటరీ వంశీ వెళ్లి బోర్డు నాటించారు. స్థలం గ్రామ పంచాయతీకి చెందినదని, ఎవరైనా క్రయ, విక్రయాలు చేస్తే శిక్షార్హులు అవుతారని బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లేఅవుట్ స్థలం న్యాయస్థానం పరిధిలో ఉంది. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును శివశంకర్ అనే వ్యక్తి తొలగించారని రెండురోజుల క్రితం పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. త్వరలో న్యాయస్థానంలో స్థల వివాదంపై తీర్పు వెలువడనున్నట్టు తెలుస్తోంది.

గ్రంథాలయాల ఆవశ్యకతపై అవగాహన అవసరం

కొడవలూరు : గ్రంథాలయాల ఆవశ్యకతపై తల్లిదండ్రుల్లో అవగాహన అవసరమని లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో కేరమ్స్ ఆడించడంతో పాటు కథలు చెప్పించడం, పాటల పాడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి రావడం వల్ల వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. మాజీ సర్పంచ్ బడుగు శ్రీనివాసులు విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు.

ఫైన్ సిటీ

- పారిశుధ్య నగరానికి చర్యలు
- వ్యర్థాలేస్తే పెనాల్టీలు విధించాలి
- అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి
- కమిషనర్ ఆదేశాలు



నజీర్‌తోటలో ఇలా..

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్లో పలు నిబంధనలున్నా, అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రజలకు అందాల్సిన సేవల మొదలుకొని అధికారులు తాము నిర్వర్తించాల్సిన విధులను సక్రమంగా నిర్వహించడం లేదు. ఆయా పనులను పర్యవేక్షించాల్సిన వారు పట్టించుకోకపోవడంతో నిబంధనలను రూపొందించినా, ప్రయోజనం కరువవుతోంది. ఈ తరుణంలో ఇలాంటి అంశాలు కమిషనర్ నందన్ దృష్టికి ఇటీవల రావడంతో వాటిని అమలు చేయాలని ఆదేశించారు.

ఇలా చేస్తే మేలు..

రోడ్లపై చెత్త వేయకుండా.. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను వాటి యజమానులు పట్టించుకోకపోయినా.. భవన నిర్మాణాలు జరుగుతున్న సమయంలో వాటి వ్యర్థాలను రహదారులపై రోజుల తరబడి నిల్వ ఉంచినా పెనాల్టీలు విధించాలి. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలకు మొక్కుబడిగా పెనాల్టీలను వసూలు చేస్తున్న అంశాన్ని పరిశీలించిన కమిషనర్ విస్తుపోయారు. ఈ తరుణంలో డివిజన్ల వారీగా తనిఖీల్లో ఎన్ని ఉల్లంఘనలను గుర్తిస్తున్నారు.. వాటికి ఎన్ని పెనాల్టీలు విధిస్తున్నారనే అంశమై తనకు నివేదిక పంపాలని ఆదేశించారు.

కొరవడిన పర్యవేక్షణ

నిబంధనల మేరకు నగరంలోని ప్రధాన రహదారులపై చెత్త, గుంతలు ఉండకూడదు. డివైడర్లు, ఐల్యాండ్లలో పచ్చదనం ఉండాలి. ఇలా పలు అంశాలను పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు విస్మరిస్తూ... బిల్లులను మాత్రం చెల్లిస్తున్నారు. కాంట్రాక్ట్ నిబంధనల్లో అన్ని పక్కాగా ఉన్నా, అమలుకు నోచుకోవడంలేదు. ఈ తరుణంలో కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో వీటిని అధికారులు అమలు చేయనున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై దర్శనమిస్తుండటంతో వాటిని తరలించాలని, లేని పక్షంలో జరిమానాలు తప్పవని సంబంధిత యాజమానులకు సూచిస్తున్నారు. ఇలా జరిమానాలు వేయడం ద్వారా నగరంలో పారిశుధ్య సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు.



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పారిశుధ్య కార్మికులు

కార్యకర్తలకు అండగా ఉంటా



నేతలతో విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో 20, 23వ డివిజన్ల పార్టీ కార్యకర్తలు, నేతలతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో పార్టీని పటిష్టపర్చి, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేస్తామని తెలిపారు. అనంతరం పార్టీ 20, 23వ డివిజన్ల ఇన్‌చార్జీలుగా వాసంతిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డిని నియమించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, నెల్లూరు రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగాధ్యక్షుడు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, మహిళాధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతాం



పార్కును పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని పార్కులను జూన్ 15 నాటికి సుందరంగా తీర్చిదిద్దనున్నామని కమిషనర్ నందన్ వెల్లడించారు. 23వ డివిజన్లోని జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో గల కల్యాణ్‌నగర్ పార్కును ఆదివారం సందర్శించిన ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని పార్కుల్లో వ్యాయామ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం రంగనాయకులపేటలోని తిక్కన.. ఎఫ్సీఐ కాలనీ.. వేపదొరువులోని పార్కులను సందర్శించారు. సంతపేట మార్కెట్లోని చికెన్ షాపులో అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు జరుగుతుండటాన్ని గమనించిన కమిషనర్.. షాపు నిర్వాహకులకు రూ.ఐదు వేల జరిమానాను విధించారు. ఇంజినీరింగ్ విభాగ ఈఈ రహంతుజానీ, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ వైద్య శిబిరం



నెల్లూరు(బృందావనం): మన్సూర్‌నగర్‌లోని హాజీరా హాస్పిటల్లో ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని జమాఅతే ఇస్లామి హింద్ నగర శాఖకు చెందిన సోషల్ సర్వీస్ సొసైటీ విభాగ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. 200 మంది రోగులకు ఎముకలు, కీళ్ల తదితర పరీక్షలను వైద్య నిపుణుడు నవాజ్ షరీఫ్ జరిపారు. సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు షహబుద్దీన్, హాస్పిటల్ గౌరవాధ్యక్షుడు జమాలుల్లా, జమాఅతే ఇస్లామి హింద్ నగర మాజీ అధ్యక్షుడు అన్వర్‌బేగ్, అబ్దుల్ ఖయ్యూం, ఫిర్దోజ్‌ఖాన్, సిరాజుద్దీన్, హుమయూన్, సాబీర్, సాజిద్, ఆయాజ్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల సమావేశం



నెల్లూరు (పొగతోట): వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీల ఆత్మీయ సమావేశాన్ని నగరంలోని ఏపీ ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఉద్యోగ నోటిఫికేషన్లో పొందుపర్చిన విధంగా తమను టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతులను కల్పించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా కార్యదర్శి బాలరాగయ్య, ఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, సిటీ ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నెల్లూరు (టౌన్): రంగనాయకులపేటలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2000 బ్యాచ్ పదో తరగతి చదివిన వారు ఒకర్నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. పాఠశాలలో ప్రాజెక్టర్ కోసం రూ.పది వేల సాయాన్ని అందజేశారు. అప్పటి టీచర్లు సురేఖ, గౌసియాబేగం, నిర్మల, పూర్వ విద్యార్థులు శ్రావణ్‌కుమార్, ఆదిత్య, గురుపవన్, కిశోర్, సువర్ణ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 9, 11, 53వ డివిజన్లలో ఆదివారం పర్యటించారు. పార్కులను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. అల్లీపురంలో ఏళ్లుగా పేరుకుపోయిన లక్షల టన్నుల చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని సుందరంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. దొంతాలి ప్రాంతంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న ఏడాదిలో నెల్లూరులోని ప్రతి ఇంటికీ తాగునీటిని సంగం బ్యారేజీ ద్వారా అందిస్తామని వెల్లడించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉంచిన నిర్మాణ సామగ్రి



పేరుకుపోయిన చెత్త

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పరిస్థితి ప్రమాదభరితంగా మారింది. దీని దిమ్మె చుట్టూ నిర్మాణ సామగ్రిని ఉంచారు. ఆటోస్టాండ్ వద్ద గల మరో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తను స్థానికులు వేస్తున్నారు. ఫ్యూజులు కాలిపోయే సమయంలో మంటలొచ్చే అవకాశం ఉంది. చెత్తకు నిప్పంటుకుంటే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాళాలు పగలగొట్టి.. సామాన్లు బయటపడేసి

నెల్లూరు(క్రైమ్): షాపు షట్టర్ తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న సామాన్లను బయటపడేసిన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు ఆదివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు బట్టీలవారివీధికి చెందిన విజయ్.. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ కాంప్లెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో షాపునకు తాళాలేసి విజయ్, ఆయన భార్య ఇంటికి శనివారం వెళ్లారు. ఆదివారం వచ్చి చూడగా, షాపులోని సామాన్లను గుర్తుతెలియని వ్యక్తులు బయటపడేసి అక్కడ కుర్చీలు వేసుకొని కూర్చొని ఉన్నారు. వారిని ప్రశ్నించగా, అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కాగా ఘటన వెనుక అసోసియేషన్ నేత చిరంజీవి హస్తం ఉండొచ్చని, గతంలోనూ ఆయన షాపును బలవంతంగా ఖాళీ చేయించేందుకు యత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ మద్యసేవనంపై కన్నెర్ర

నెల్లూరు సిటీ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసును నెల్లూరు రూరల్ పోలీసులు నమోదు చేశారు. జాతీయ రహదారికి సమీపంలోని పద్మావతి గ్రీన్‌సిటీ, మరో లేఅవుట్లో చెట్ల కింద కూర్చొని బహిరంగంగా మద్యాన్ని కొందరు ఆదివారం సేవించసాగారు. దీంతో రూరల్ సీఐ వేణు ఆధ్వర్యంలో ఎస్సైలు లక్ష్మణరావు, ప్రసాద్‌రెడ్డి దాడులు జరిపి, కేసులు నమోదు చేశారు.

ఘనంగా రాగాల పల్లకి



నటి శ్వేతకు సత్కారం

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో రాగాల పల్లకి కార్యక్రమాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయుర్వేద వైద్యుడు బొనిగి ఆనందయ్య హాజరయ్యారు. అనంతరం నటి శ్వేత, కళాకారులను సత్కరించారు. రవి కుమార్, కృష్ణవేణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెం యువకుడికి డాక్టరేట్



ఆరిఫ్

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళేనికి చెందిన షేక్ ఆరిఫ్‌కు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో పవర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ చేసి పవర్ లాస్‌ను తగ్గించి హార్మోనిక్స్‌ను తగ్గించడం అనే విషయంలో పరిశోధన చేయడం ద్వారా పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. పరిశోధనకు మార్గదర్శకుడిగా డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, ఉప మార్గదర్శకుడిగా డాక్టర్ సచిన్ మిశ్రాలు వ్యవహరించారు. పరిశోధన అనంతరం వైవా పరీక్షను ధన్‌బాద్ ఐఐటీ విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో నిర్వహించారు.

యోగాతో ఒత్తిడి దూరం



నెల్లూరు (పొగతోట): యోగా, వ్యాయామంతో ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు అవకాశం ఉందని ఏఎస్పీ సౌజన్య పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లో ఎస్వీ లైఫ్ వ్యాలీ సంస్థను ఆదివారం ఆమె ప్రారంభించారు. డీఎస్పీ సింధుప్రియ, సెంట్రల్ సీఈఓ నాగేశ్వరరావు, సాయిలలితారెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సైకాలజిస్ట్ సురేష్‌బాబు, ట్రెయినర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం



నెల్లూరు(అర్బన్): నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్‌లో ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని గ్రౌండ్ వాకర్స్ లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు హాస్య ప్రసంగాలు చేశారు. అనంతరం వాకర్స్‌కు అల్పాహారాన్ని అందజేశారు. క్లబ్ కార్యదర్శి, పంచాయతీరాజ్ ఇంజినీర్ల జేఏసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రియాజ్, క్లబ్ డైరెక్టర్, జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, యోగా మాస్టర్ వెంకురెడ్డి, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, పర్వీన్, న్యాయవాది నన్నేసాహెబ్, ఎమ్వీఐ ఆజాద్ జకీర్, శివబాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్‌లో పలువురి చేరిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోవూరులోని పెళ్లకూరు కాలనీకి చెందిన పలువురు యువకులు ఏఐవైఎఫ్‌లో ఆదివారం చేరారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం 14 మందితో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా దిలీప్‌కుమార్, మీరామొహిద్దీన్‌ను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మున్నా మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు విస్మరించి ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. సందానీ, అల్లాబక్షు, అహ్మద్‌బాషా, రెహ్మాన్, వెంకటేశ్వర్లు, షానవాజ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధునిక దంత వైద్యం



నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని రెయిన్ థియేటర్ ఎదురుగా టైనీ టూత్ చిన్నపిల్లల దంత వైద్యశాలను ఆదివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా నారాయణ దంత వైద్యశాల డీన్ శివకుమార్, కేర్ దంత వైద్యశాల అధినేత స్వరూప్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల దంత వైద్యురాలు సాయిప్రియ మాట్లాడారు. చిన్నారులకు ఆధునిక దంత వైద్యాన్ని అందిస్తున్నామని వివరించారు. స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి అధినేత బీరం రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులను మే 15న ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. కొండాయపాళెం, బీవీనగర్ రైల్వేగేట్ల వద్ద అండర్ బ్రిడ్జిలకు టెండర్లను జూన్ నెలాఖరులో ఆహ్వానించేలా యత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

హాస్యనటుడు దోర్నాలకు పురస్కారం

నెల్లూరు(బృందావనం): ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో తెలుగు సంస్కృతి, సాహితి సేవా ట్రస్ట్, మాచవరం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన హాస్యనటుడు దోర్నాల హరిబాబును మహానంది పురస్కారంతో సత్కరించారు. దైవజ్ఞశర్మ, మురళీకృష్ణారెడ్డి, నిర్వాహకులు మాచవరం గౌరీశంకర్‌శాస్త్రి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.